## శాస్త్రోక్తంగా లక్ష్మీనరసింహుల నిత్యోత్సవం


స్వామి, అమ్మవార్ల నిత్య తిరు కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, మే 30 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్ల నిత్యోత్సవాలు శాస్త్రోక్తంగా జరిగాయి. గురువారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో నరసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో నారసింహులు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం నిర్వహించారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవ జరిపారు. అనంతరం కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతు చేపట్టారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు జరిపారు. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ. 48,35,096 ఆదాయం సమకూరినట్లు ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఈఓ భాస్కర్ రావు తెలిపారు.

**రేపు క్షేత్రపాలకుడికి లక్ష తమలపాకుల అర్చన**

హనుమాన్ జయంతి సందర్భంగా జూన్ 1న క్షేత్రపాలకుడికి లక్ష తమలపాకుల అర్చన నిర్వహించనున్నట్లు ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. ప్రధానాలయంలోని విష్ణు పుష్కరిణి చెంత, పాతగుట్టలోని గుండం వద్ద గల ఆంజనేయస్వామి ఆలయాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు అష్టోత్తర శతమన్యసూక్త పారాయణాలచే అభిషేకం, లక్ష తమలపాకుల అర్చన, మహానివేదన నిర్వహిస్తామన్నారు. రూ.516 చెల్లించి దంపతులు లక్ష తమలపాకుల అర్చనలో పాల్గొనవచ్చని తెలిపారు.


ఆత్మకూరు(ఎం) : గురువారం మధ్నాహ్నం 2:30 గంటలకు నిర్మానుష్యంగా మోత్కూర్‌–భువనగిరి ప్రధాన రోడ్డు


గురువారం మధ్నాహ్నం 2 గంటలకు ఆత్మకూరు(ఎం) హైస్కూల్ చౌరస్తా వద్ద..


గురువారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్మానుష్యంగా బ్యాంక్ కాలనీ

## దంచికొడుతున్న ఎండలు.. నిర్మానుష్యంగా రోడ్లు

ఎండలు దంచికొడుతుండడంతోపాటు ఉక్కపోత ఎక్కువగా ఉండడంతో ప్రజలు బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. ఉదయం 10 గంటలకే ఎండ మండిపోతుండడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మధ్యాహ్నం అయ్యిందంటే చాలు.. కూలర్లు, ఏసీలను ఆశ్రయిస్తున్నారు. గురువారం ఆత్మకూరు(ఎం)లో భానుడి ప్రతాపానికి తట్టుకోలేక మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రోడ్లన్నీ నిర్మానుష్యంగా దర్శనమిచ్చిన దృశ్యాలివి.

– ఆత్మకూరు(ఎం), మే 30

## యథేచ్ఛగా చెరువు మట్టి రవాణా

- అనుమతి లేకుండా ఇటుకబట్టీలకు తరలింపు


మోటకొండూర్ : రాయికుంటపల్లి చెరువు నుంచి మట్టిని తరలిస్తున్న వాహనాలు

మోటకొండూర్, మే 30 : మండలంలోని రాయికుంటపల్లి చెరువు నుంచి అనుమతి లేకుండా మట్టిని ఇటుకబట్టీలకు తరలిస్తున్నారు. ఈ విషయాన్ని గ్రామస్తులు సంబంధిత ఇరిగేషన్, రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఇరిగేషన్ డీఈఈ సునీల్ ప్రసాద్, ఏఈ వెంకటరమణయ్య గురువారం చెరువు వద్దకు వెళ్లి మట్టి తరలింపును నిలిపివేశారు. ఇటుకబట్టీ నిర్వాహకుల నుంచి మట్టి తరలింపు కోసం అనుమతి ఇవ్వాలని తమకు ఎలాంటి సమాచారం లేదని సంబంధిత అధికారులు తెలిపారు. మట్టిని తరలించేందుకు ఐబీ, మైనింగ్ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.

రాజాపేట : మండలంలోని బేగంపేట గండి చెరువు, నెమిలె, సోమారం చెరువుల నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇటుక బట్టీలకు మట్టి తరలింపు కొనసాగుతున్నది. గురువారం మండలంలోని సోమారం వైపు నుంచి పెద్దఎత్తున టిప్పర్ల ద్వారా రఘునాథపురం శివారులో ఇటుక బట్టీల కోసం మట్టి తరలించి నిల్వ చేస్తున్నట్లు తెలిసింది. మట్టి తరలింపును నిలిపివేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## వైకుంఠధామం పూర్తయ్యేదెప్పుడో!

- బిల్లులు రాక ఆగిన నిర్మాణ పనులు


భూదాన్‌పోచంపల్లిలో నిలిచిపోయిన వైకుంఠధామం పనులు


స్టోర్ రూమ్ వద్ద పెరిగిన కంపచెట్లు

భూదాన్‌పోచంపల్లి, మే 30 : పర్యాటక కేంద్రమైన భూదాన్‌పోచంపల్లిలో చేపట్టిన వైకుంఠ ధామం నిర్మాణ పనులు నిలిచిపోయాయి. 13 వేలకు పైగా జనాభా, 4,200 ఆవాసాలు ఉన్న మున్సిపాలిటీలో గత ప్రభుత్వం ఆధునిక హంగులతో వైకుంఠ ధామం నిర్మించేందుకు స్పెషల్ ఫండ్ కింద కోటి రూపాయలను రెండేండ్ల క్రితం మంజూరు చేసింది. ఏడాదిలో వైకుంఠధామ నిర్మాణ పనులు పూర్తిచేసి పట్టణ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఏడాదిన్నర క్రితం పనులు చేపట్టారు. కేటాయించిన గడువు ముగిసిపోయింది. అయితే చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో సదరు కాంట్రాక్టర్ పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు. దాంతో పట్టణ ప్రజలు అంతిమ సంస్కారాల నిర్వహణకు ఇబ్బందులు పడుతున్నారు. మార్కండేయనగర్ కాలనీ సమీపంలో పర్రె కాల్వ వద్ద మెయిన్ రోడ్డు పక్కనే దహన సంస్కారాలు చేస్తున్నారు. అక్కడ నిల్వ నీడ, నీరు, కరెంటు లేకపోవడంతో దహన సంస్కారాలు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్యాంకర్ ద్వారా నీరు తెప్పించుకునే దుస్థితి నెలకొన్నది.

**40 శాతం పనులు మాత్రమే పూర్తి..**

పట్టణ పరిధిలోని భీమనపల్లి రహదారిలో చేపట్టిన వైకుంఠ ధామం నిర్మాణ పనులు కేవలం 40 శాతం మాత్రమే పూర్తయ్యాయి. రెండు బర్నింగ్ ప్లాట్‌ఫామ్‌లు, రెండు వెయిటింగ్ హాళ్లు, పూజా మండపం, 8 టాయిలెట్స్, కట్టెలు భద్రపరిచే గది, ఆఫీస్ రూమ్, ప్రహరీ, ఫుట్‌పాత్ గ్రీనరీ, లైట్లు, స్నానాలు చేసేందుకు నీటి సౌకర్యం, నల్లాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ, ఇప్పటివరకు కట్టెలు భద్రపరిచే గదితో పాటు బర్నింగ్ ప్లాట్‌ఫామ్‌లు, వెయిటింగ్ హాళ్ల స్లాబ్ పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఏడాదిగా పనులు నిలిచిపోవడంతో వైకుంఠధామం పరిసరాలు కంపచెట్లతో నిండిపోయి అధ్వానంగా మారాయి. ఇకనైనా అధికారులు స్పందించి వైకుంఠధామ నిర్మాణ పనులు పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.


వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన వారికి పుస్కారాలు అందజేస్తున్న డిపో మేనేజర్ పాల్

## ఆర్టీసీ సిబ్బంది అంకితభావంతో పని చేయాలి

మిర్యాలగూడ డిపో మేనేజర్ పాల్

మిర్యాలగూడ టౌన్, మే 30 : ఆర్టీసీ సిబ్బంది అంకిత భావంతో పనిచేసి సంస్థను అభివృద్ధిపథంలో నిలుపాలని మిర్యాలగూడ డిపో మేనేజర్ పాల్ కోరారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపోలో జరిగిన ఆదర్శ ఉద్యోగుల అభినందన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంస్థకు అధిక రాబడి తీసుకురావడానికి కృషి చేసిన ఉద్యోగులకు పారితోషికంతో పాటు, ప్రశంసాపత్రాలు అందిస్తున్నట్లు తెలిపారు. వీరిని స్ఫూర్తిగా తీసుకొని అందరూ పోటీపడి పని చేయాలని సూచించారు. అనంతరం డ్రైవర్, కండక్టర్, మెకానిక్, శ్రామిక్ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన వారికి పుస్కారాలను అందించారు. కార్యక్రమంలో సీఐ భారతీబాయి, ఎంఎఫ్ యాదగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా సిరిమాను ఊరేగింపు

అడవిదేవులపల్లి, మే 30 : మండల కేంద్రంలో కనకదుర్గమ్మ జాతరను గురువారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి సిరిమాను ఊరేగింపును వైభవంగా జరిపారు. ఆలయం నుంచి గ్రామంలోని అన్ని వీధుల గుండా మానును ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రమావత్ బాలు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాదిల శ్రీను, నాయకులు పాల్గొన్నారు.


సిరిమాను ఊరేగింపులో పాల్గొన్న ప్రజలు

## పట్టణాభివృద్ధే లక్ష్యం

- మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు


రోడ్డు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు

చౌటుప్పల్, మే 30 : పట్టణాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. పట్టణ కేంద్రంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న పైపులైన్లను సరిచేసి ప్రజలకు అనుగుణంగా రోడ్డు నిర్మించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బొడిగె బాలకృష్ణగౌడ్, ముత్యాల భూపాల్‌రెడ్డి, ముత్యాల హనుమంత్‌రెడ్డి, దేపరాజు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి : డీఈఓ


నమాత్‌పల్లిలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డీఈఓ నారాయణరెడ్డి

భువనగిరి కలెక్టరేట్, మే 30 : అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్న పాఠశాలల అత్యవసర పనులను వేగంగా పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె.నారాయణరెడ్డి సూచించారు. గురువారం మండలంలోని అనాజిపురం, నందనం, నమాత్‌పల్లి పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ ప్రసాద్‌తో కలిసి పరిశీలించి మాట్లాడారు. వారి వెంట ప్రధానోపాధ్యాయులు, ఎస్‌ఎంసీ చైర్మన్లు ఉన్నారు.

## ప్రభుత్వ విప్ అయిలయ్య పరామర్శ

రాజాపేట, మే 30 : మండలంలోని చల్లూరుకు చెందిన బైకని బీరప్ప, గుంటి బాలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య గురువారం మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నెమిలె మహేందర్‌గౌడ్, నాయకులు బొంత సుధాకర్, బుడిగె పెంటయ్య, ఇంజ నరేశ్, బడే ఎల్లయ్య, ఇందిర, భీమగాని బాలనర్సయ్య, కనకయ్య, నవీన్, యాదేందర్, గౌరయ్య, సిద్ధులు, కరుణాకర్, రాములు ఉన్నారు.

## వినోబా మందిరం నిర్మించారు.. ప్రారంభం మరిచారు



భూదాపోచంపల్లిలోని వినోబా మందిరం

భూదాన్‌పోచంపల్లిలో భూదానోద్యమ చారిత్రక నేపథ్యానికి స్మృతి చిహ్నంగా నిర్మించిన వినోబా మందిరం నేటికీ ప్రారంభానికి నోచలేదు. 2012లో సుమారు రూ.50 లక్షల నిధులతో పట్టణంలో వినోబా మందిరాన్ని నిర్మించగా.. నేటికీ తాళం వేసి కనిపిస్తుంది. నిత్యం దేశ, విదేశాల నుంచి అధికారులు, సందర్శకులు ఇక్కడికి వస్తుంటారు. నాటి భూదానోద్యమ చారిత్రాత్మక నేపథ్యాన్ని చాటేందుకు ఫొటో గ్యాలరీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. కానీ, నేడు ఆదరణ లేక వినోబా మందిరం వెలవెలబోతున్నది. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మందిరాన్ని సందర్శకులకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. –భూదాన్‌పోచంపల్లి, మే 30

## వేధింపులు తాళ లేక వ్యక్తి ఆత్మహత్య


విజేందర్(ఫైల్)

సంస్థాన్ నారాయణపురం, మే 30 : భార్య తరపు బంధువుల వేధింపులు తాళలేక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని జనగాంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని జనగాం గ్రామానికి చెందిన ఒర్సు విజేందర్ వృత్తి రీత్యా కంప్రెషర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. అనారోగ్యంతో గత మూడు నెలలుగా ఇబ్బంది పడుతున్నాడు. ఈక్రమంలో విజేందర్, భార్య వైష్ణవి ఆమె తల్లిదండ్రులతో కలిసి ఈ నెల 21న తీర్థయాత్రలకు వెళ్లారు. 27న తిరిగి వచ్చిన అనంతరం విజేందర్‌ను ఇంటి వద్ద వదిలేసి వైష్ణవి తన తల్లిగారింటికి వెళ్లింది. తీర్థయాత్రలో భార్య తరపున బంధువుల వేధింపులకు గురి చేయడంతో మనస్థాపనికి గురై బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో విజేందర్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన ఆయన తల్లిదండ్రులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భార్య తరపు బంధువుల వేధింపులు తాళలేకనే ఆత్మహత్య చేసుకున్నట్లు విజేందర్ సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ జగన్ తెలిపారు.

## విత్తన షాపుల్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు


రాజాపేటలో విత్తనాల షాపును తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

రాజాపేట, మే 30 : మండల కేంద్రంలోని విత్తన షాపుల్లో గురువారం టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా విత్తనాలు, స్టాక్ రికార్డులను పరిశీలించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో జిల్లా సహాయ సంచాలకుడు దేవ్‌సింగ్, వ్యవసాయాధికారులు ఇజాజ్ అలీఖాన్, అంజని, మాధవి, ఏఎస్ఐ నవీన్, పోలీసులు పాల్గొన్నారు.


చౌటుప్పల్ : సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

## సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

చౌటుప్పల్, మే 30 : చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పరిశ్రమలు, వివిధ కార్యాలయాల ముందు జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్మికుల పక్షాన సీఐటీయూ చేసిన పోరాటలను పలువురు గుర్తు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ పాషా, ఆదిమూలం నందీశ్వర్, బత్తుల దాసు, గోశిక కరుణాకర్, రాజు పాల్గొన్నారు.

బొమ్మలరామారం : కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీఐటీయూ నిరంతరం పని చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు అన్నారు. మండల కేంద్రంలో గురువారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అసంఘటిత కార్మికులకు ఇచ్చిన హామీలు ఇంత వరకు నెరవేరలేదన్నారు. మున్సిపల్, పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు ర్యాకల శ్రీశైలం, కార్మిక సంఘం సభ్యులు బాలయ్య, ఐలయ్య, సత్తయ్య, ఎల్లయ్య, మనెమ్మ, లక్ష్మి, పెంటమ్మ, ఆండాలు, లక్ష్మి పాల్గొన్నారు.

## అభయాంజనేయుడికి ఇత్తడి తొడుగు

మోత్కూరు, మే 30 : మండలంలోని అనాజిపురంలో అభయాంజనేయ స్వామికి దాతలు ఇత్తడి తొడుగును బహూకరించారు. గురువారం గ్రామంలోని ఆంజనేయ స్వామికి హైదరాబాద్‌కు చెందిన కుంచాల మధురాంరెడ్డి–రాధిక దంపతులు రూ.1.25 లక్షల విలువైన ఇత్తడి తొడుగును అందజేశారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి స్వామివారికి అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత గోరుపల్లి సంతోష్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

## రేపు ఆంజనేయ స్వామి జయంత్యుత్సవం

భూదాన్‌పోచంపల్లి, మే 30 : పట్టణ కేంద్రంలోని భక్తాంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తాంజనేయ భజన మండలి 25వ వార్షికోత్సవం, స్వామి జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు భజన మండలి అధ్యక్షుడు లోక శ్రీరాములు, ఉపాధ్యక్షుడు పెద్ది సత్తయ్య, ప్రధాన కార్యదర్శి జెట్ల కృష్ణస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో మేలుకొలుపు, ధ్వజారోహణం, యజ్ఞం, విఘ్నేశ్వర, నవగ్రహ, నాగదేవత పూజలు, సాయి నామార్చన, అభిషేకం, సహస్రనామార్చన, భక్తాంజనేయ స్వామి సేవ ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.


పామాయిల్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఆయిల్‌ఫెడ్ అధికారులు


## సిరిపురంలో పామాయిల్ సాగుపై అవగాహన

రామన్నపేట, మే 30 : పామాయిల్ సాగులో క్రమం తప్పకుండా పూత తీయడంతో పంట సాగు వృద్ధి చెందుతుందని ఆయిల్‌ఫెడ్ జిల్లా మెనేజర్ ఎండీ ఖాజా మొయినొద్దీన్, జిల్లా కో ఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని సిరిపురంలో ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో రైతులకు అవగహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పూత మొదలయ్యాక కొన్నాళ్లపాటు క్రమం తప్పకుండా తొలగిస్తే పంట దిగుబడి పెరుగుతుందన్నారు. పంట సంరక్షణ సరైన పద్ధతిలో ఉంటేనే మొక్కల పెరుగుదలతోపాటు దిగుబడి బాగా వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## నేడు 'బడి బాట'పై సమావేశం

మోత్కూరు, మే 30 : జూన్ 3 నుంచి19 వరకు నిర్వహించనున్న బడి బాట కార్యక్రమంపై శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మనోహర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాల్లోని ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మధ్యాహ్నం 3 గంటలకు జరుగనున్న సమావేశానికి విధిగా హాజరు కావాలని సూచించారు.

## ఆత్మకూరు(ఎం) హైస్కూల్‌లో అభివృద్ధి పనులు


పనులను పరిశీలిస్తున్న హెచ్‌ఎం అరవిందరాయుడు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సుగుణ

ఆత్మకూరు(ఎం), మే 30 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధి కోసం మొదటి విడుతలో రూ.67వేలు మంజూరయ్యాయి. దాంతో పాఠశాలలో తాగు నీటి కోసం నల్లాలను ఏర్పాటు చేసి మరమ్మతు పనులు చేపట్టారు. పాఠశాల గదుల్లో మైనర్ రిపేర్లతోపాటు మూత్రశాలలు, మరుగుదొడ్లకు డోర్లు ఏర్పాటు చేసినట్లు పాఠశాల హెచ్‌ఎం అరవిందరాయుడు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సుగుణ గురువారం తెలిపారు.

## కోళ్ల వ్యర్థాలతో దుర్వాసన

ఆలేరు–కొలనుపాక ప్రధాన రహదారి వెంట కోళ్ల కళేబరాలు


ఆలేరు–కొలనుపాక రహదారి వెంట పడేసిన కోళ్ల వ్యర్థాలు

ఆలేరు రూరల్, మే 30 : ఆలేరు నుండి కొలనుపాక వెళ్లే ప్రధాన రహదారి దుర్గంధాన్ని వెదజల్లుతుంది. రోడ్డు ప్రక్కన విచ్చవిడిగా పడేసిన కోళ్ల కళేబరాలు, వ్యర్థాలు ప్రయాణికులు, వాకర్స్‌కు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. వ్యర్థాలు దుర్గంధంతో వ్యాధులు సంక్రమించే ప్రమాదమున్నందున అధికారులు స్పందించి వ్యర్థాలు వేసే వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## హనుమాన్ ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ

చౌటుప్పల్, మే 30 : చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని పెరుమాళ్ల ఆంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాల కరపత్రాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు చేశారు. మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, బాలకృష్ణగౌడ్, ఆంజనేయులు, శ్రీనివాస్‌చారి పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహాలు

భువనగిరి అర్బన్, మే 30 : భువనగిరి పట్టణంలో గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని భువనగిరి ఖిలా సమీపంలో గల ఆంజనేయ స్వామి దేవాలయం సమీపంలో యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతికి గల కారణాలను క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు. కాగా, మృతుడి వయసు సుమారు 45 సంవత్సరాలే ఉండవచ్చని, పింక్ కలర్ షర్ట్, బ్లాక్ కలర్ పాయింట్, బనియన్ ధరించి ఉన్నాడని, మృతదేహాన్ని ఏరియ దవాఖాన మార్చురీలో భద్రపర్చినట్లు చెప్పారు. ఆచూకీ కోసం పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని, ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

ఆలేరు రూరల్ : ఆలేరు పట్టణ సమీపంలో సికింద్రాబాద్ నుంచి కాజీపేట వైపు వెళ్లే డౌన్ లైన్‌లో గుర్తు తెలియని మృతదేహం గురువారం లభ్యమైంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు, వంగపల్లి డౌన్‌లైన్‌లో కిలోమీటర్ నంబర్ 260–16–18 వద్ద కాజీపేట వైపు వెళ్లే గుర్తు తెలియని రైలు నుంచి సుమారు 38 ఏండ్ల వయస్సు గల వ్యక్తి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. మృతుడు బ్లాక్‌బ్లూ చెక్స్ షర్ట్, బ్లూ జీన్స్ ధరించి ఉన్నాడు. కీ మెన్ ద్వారా స్టేషన్ మాస్టర్ శ్రీధర్ రైల్వే పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని గుర్తించి స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు రైల్వే ఏఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.